


అమెరి"కలకలం" కథలు

– వంగూరి చిట్టెన్ రాజు



# మూడు రోజులూ
# రెండు అఘాయిత్యాలు
# ఒక సొంత రాష్ట్రం

ఫిబ్రవరి మొదటి వారంలో అర్జంటు పని మీద అప్పటికి యింకా ఆంధ్రప్రదేశ్ లోనే ఉన్న కాకినాడ వెళ్ళాను. అప్పుడే "బుట్టే వారి" కొత్త గంటల పంచాంగం మార్కెట్ లో కనపడగానే కొనేసి, పేజీలు తిప్పేసి నా రాశి ఫలితాలు ఎవరూ చూడకుండా గదిలోకి వెళ్లి రహస్యంగా చూసుకోగానే యధాప్రకారం ఈ ఏడూ కూడా నాకు ఆదాయం అర్ధణా - వ్యయం అరవై ఆరు డాలర్లు అనియూ, రాజపూజ్యం అర నిముషం – అవమానం ఆరునెలలు అనియునే కాక నాకు ఈ ఏడు ఏలినాటి ప్రభావం చాలా ఉంది అని కూడా అదేదో పెద్ద శుభ వార్తలాగా ఎర్ర ప్రింటులో అచ్చు గుద్ది పారేసారు బుట్టే వారు. కొత్త ఉగాది ఎప్పుడో వచ్చే నెల మార్చి 31, 2014 న కదా, రూలు ప్రకారం అప్పటి దాకా ఈ ఏలినాటి శని మన జోలికి రాడులే అనే ధీమాలో ఉన్న నాకు నెల ముందే ఫిబ్రవరి 20-21-22 తారీకులలోనే ముచ్చటగా మూడు శాంపుల్స్ చూపించి తన సత్తా నిరూపించుకున్నాడు. ఎటునుంచి, ఎలా చూసినా ఆ మూడూ కూడా చారిత్రక సంఘటనలే. వాటి గురించి ఇప్పుడు టూకీగా ప్రస్తావిస్తాను. నేను బతికి, మీరు కూడా బావుంటే మహత్తరమైన విశేషాలు త్వరలోనే రాస్తాను.

ఇందులో మొదటిది అవగానే, నేను ఆ ఉదంతాన్ని పెర్సనల్ గా తీసుకుని

"అదేమిటయ్యా, యింకా కొత్త సంవత్సరం రాకుండానే ఇలా నా మీద పడ్డాడేమిటీ మీ ఏలినాటి శని గాడు" అని మా "ఏస్ట్రో" ప్రసాదు ని నిలదీశాను.

ఆయనే మా ఈ తరం యువ కంప్యూటర్ సిద్ధాంతి.

"మీరు ఎంత ఎన్నారై అయినా అలా అన కూడదు సార్! మీరు కావాలంటే నన్ను సిద్దాంతి గాడు అనండి కానీ గ్రహబలం అమితంగా ఉన్న ఆయన్ని ఏలినాటి శని గాడూ, గీడూ అనకండి, ఆయన రెచ్చిపోతారు" అని ఈయన నొచ్చుకున్నాడు.

ఇది ఎటువంటిదీ అంటే ..మనకి చిరంజీవి కేవలం తెర మీదే తెలుసు అనుకోండి. అప్పుడు ఖచ్చితంగా "చిరంజీవి గాడు బాగా స్టెప్పులేశాడు, కామెడీ చేశాడు" అనే అంటాం. తీరా ఎప్పుడైనా పొరపాటున ఎక్కడైనా కలిసి ఆయనతో ఒక చచ్చు ఫోటో దిగామనుకోండి ...ఇంకే ముందీ ఆయనతో గోళీకాయలు ఆడుకున్న ఫీలింగ్ వచ్చేసి అప్పటినుంచీ "చిరంజీవి గారు బాగా స్టెప్పులేశారు, కామెడీ చేశారు" అని ప్లేటు మార్చేసి పలవరిస్తాం కదా! అలాంటిదే ఈ శనిగాడు, శని గారు అనే విషయం కూడా.

"అసలు ఈ ఏలినాటి శని మిమ్మల్ని పట్టుకుని మూడో సంవత్సరం గడుస్తోంది" అని ఏస్ట్రో ప్రసాద్ గారు యధాలాపంగా అనగానే హడిలి పోయి "యింకా ఎన్నేళ్ళు ఇలా పట్టుకుంటాడు?" అని గభాలున అడిగాను.

"భలే వారే..బాగా చదువుకున్నారు కదా. అయినా ఆ మాత్రం శాస్త్రం తెలీదా తమకి. ఏలినాటి శని ఎప్పుడొచ్చినా ఏడున్నరేళ్ళు ఉంటుంది. తమరి జీవితంలో ఈయన మిమ్మల్ని పట్టుకోవడం మూడో సారి" అని నా జీవిత రహస్యాన్ని ఆయన బట్టబయలు చెయ్యగానే నేను ఊపిరి పీల్చుకున్నాను.

"అయితే పరవా లేదు. అసలు అన్నేళ్ళు నేనే ఉండే ప్లాన్ లేదు లెండి. ఐ విల్ బీట్ హిమ్" అని కాన్ఫిడెంట్ గా చెప్పి "అయితే ఫిబ్రవరి 20 న రాజ్య సభ లో తెలంగాణా బిల్లు ఆమోదం పొందడం నా ఏలినాటి శని ప్రభావం వలన కాదా?" అని అడిగాను.

ఫిబ్రవరి 19, 20 తేదీలలో జరిగిన భారత పార్లమెంట్ సమావేశాలు ఇరవై గంటలూ, అందులో అమెరికాలో ఆడవాళ్ళు మాన భంగం భగ్నం చెయ్యడానికి వాడే పెప్పర్ స్ప్రే ని ఒక మగ పార్లమెంట్ సభ్యుడు రాష్ట్ర విభజన కూడా తన మాన భంగం అనుకుని దాన్ని భగ్నం చెయ్యడానికి వాడిన తీరు నిశితంగా గమనించి ఇదంతా ఖచ్చితంగా ఏలినాటి శని ప్రభావమే అనుకున్నాను నేను.

మా యువ సిద్ధాంతి గారు మీన మేషాలు లెక్కపెట్టి "మీరొక్కరే కాదు. తెలంగాణా లోనూ, సీమాంధ్రాలోనూ, ఉత్తర అమెరికాలోనూ ఉన్న అనూరాధా నక్షత్ర జాతకులందరికీ ఈ రాష్ట్ర విభజన నిర్ణయం ఏలినాటి శని వారి ప్రభావమే అనుకోవాలి. కానీ, చూశారూ, పోతూ, పోతూ మంచి చేసి పోతాడు" అని ప్రవచించారు సిద్ధాంతి ప్రసాద్ గాడు..సారీ.....గారు.

ఈ రాష్ట్ర విభజన టూ.గొ.జి. కి చెందిన నా కొంప ఏ విధంగా ముంచుతుందో అని భయాందోళనలు చెందుతున్న నాకు యింకా చాలా మంది కొంపలు కూడా మునుగును అనే ఆయన మాటలు కొంత ఊరట కలిగించాయి. ఇక్కడ "పోతూ, పోతూ" అన మాటని నాకు ఆపాదించి ఎవరూ అపార్థం చేసుకోకూడదనీ, నేను ఇప్పుడప్పుడే ఎక్కడికీ పోను గాక పోను అనీ, ఇప్పుడే టపాసులు పేల్చుకుని ఆనందించవద్దని నా "గాఢ మిత్రులూ - గూఢ శత్రువులని" కోరుతున్నాను. గొడవలన్నీ సద్దుకున్నాక నాలుగైదేళ్ళ లో ఏలినాటి శని ఎక్కడికి పోతారో తెలియని చోటికి పోతూ బొంబాయి ఐ. ఐ.టీ లో నా మూడేళ్ళ శిష్యుడు జైరాం రమేష్ ద్వారానో, రాబోయే ఎన్నికలలో ఆయన ఓడిపోతే మోడీ గారి ద్వారానో రెండు రాష్ట్రాలవారికీ మంచి జరిగేలాగా, హైదరాబాద్ లో ఫ్లాట్ ల ఖరీదు మళ్ళీ పుంజుకునే లాగా చేసి పోతాడు అనే ఈ "పోతూ, పోతూ" అనే మాటలకి అర్థం చెప్పుకోవాలి.

ఈనాటి రాష్ట్ర విభజన ఎప్పుడో 1972 లో జరిగిన జై ఆంధ్రా ఉద్యమం విజయవంతం అవడానికి ఇన్నేళ్ళు పట్టింది సుమా అని నా అభిప్రాయం. పైగా "కోటి రతనాల వీణ" అయిన తెలంగాణాను వేరు చేసి మిగిలిన సీమాంధ్రా ప్రాంతాన్ని భౌగోళికంగా చూస్తే, అచ్చు "వీణ" లాగే ఉంటుంది. రాష్ట్ర విభజన ఏలినాటి శని ప్రభావం అనీ మంచో, చెడో ఎవరికీ తెలియదు కానీ అన్నీ మన మంచికే అని కూడా నా అభిప్రాయం.

ఇక ఫిబ్రవరి ఒకటో తారీకున కాకినాడలో అడుగుపెట్టి, 20 వ తారీకు దాకా నేను తెలుగు వారిని కాంగ్రెస్ ప్రభుత్వం "పట్టు వదలని విక్రమార్కుడి" లా విడగొట్టిన అస్తవ్యస్త విధి విధానాలని టీవీలలో చూసి, పత్రికలో చదివి ఫిబ్రవరి 21 నాడు సమైక్యాంధ్ర సమ్మె విరమణ లోక్ సభ & రాజ్య సభలో జరగ గానే "అమ్మయ్య, మొత్తానికి శని వదిలింది" అనుకున్నాను. ఎందుకంటే, కాకినాడలో మా తాత గారి నుంచి నాకు వారసత్వంగా వచ్చిన అరా, కొరా మెరక పొలం అమ్మేసి అమెరికాలో పుట్టి పెరిగి అసలు "పొలం" అంటేనే తెలియని మా పిల్లలకి ఇబ్బందులు తప్పిద్దామనే సదుద్దేశ్యమే నేను ఈ సారి ఇండియా వెళ్ళడానికి ప్రధాన కారణం. తీరా అక్కడికి వెళ్ళాక సమైక్యాంధ్రా ఉద్యమం లో ఎన్జీవో లందరూ హాయిగా ఇరవై రోజులు సమ్మెలో ఉండడంతో రిజిస్ట్రేషన్ ఆఫీసులు అన్నీ మూతపడ్డాయి. వాటి గేటుకి తాళం వేసి, ఉద్యోగస్తులందరూ రోడ్డు మీద అర్ధనగ్నంగా, వంటలు చేసుకుంటూ, పాటలు పాడుకుంటూ కాలం వెళ్ళ బుచ్చుతూ ఉండగా నేను కూడా రోజూ చూడడానికి వెళ్లి నా "అమెరికాలాన్ని" వెళ్ళబుచ్చాను. మహిళా ఉద్యోగస్తులు కూడా అర్ధనగ్నంగానో, పావు నగ్నంగానో వంట చేస్తున్నారేమో అని మాత్రమే నేను రిజిస్ట్రార్ ఆఫీసుకు చూడడానికి వెళ్లానని ఎవరైనా భావిస్తే మా క్వీన్ విక్టోరియా మీద ఒట్టే!

తీరా ఫిబ్రవరి 21 నాడు కేంద్రం వారు "తెలంగాణా ఇచ్చేశాం. సీమాంధ్రా వారు తన్నుకు చావండి" అని ప్రకటించగానే అందరూ ఇక చేసేది ఏమీ లేక, పొయ్యి ఆరబెట్టేసి, బట్టలు వేసుకుని ఆఫీసులకి వెళ్ళగానే నేనూ, మా పొలం కొనుక్కుంటున్న ఆయనా అన్ని కాగితాలు పట్టుకుని అవి నమోదు చేయించుకోడానికి రిజిస్ట్రార్ గారి బెంచ్ దగ్గరకి వెళ్లాం. ఆయన "అమ్మయ్య ఇన్నాళ్ళకి మళ్ళీ బేరం దొరికింది" అని నా పొలం వివరాలు కంప్యూటర్ లో కొట్టి, కళ్ళు తిరిగి ధబీ మని కింద పడ్డాడు. ఎందుకంటే ఆ కంప్యూటర్ ప్రకారం నాకు ఉన్నది మెరక పొలం కాదు. గ్రామ కంఠం ..అనగా ఇళ్ళస్థలాలు ట. "ఏదయితేనేం" అని నేను అనబోతుంటే నాతో వచ్చిన మా అన్నయ్య నన్ను వెర్రి వెధవని చూసినట్టు చూశాడు. ఇంతలో మా కొనుగోలు దారు గారు కూడా కంప్యూటర్ లోకి చూసి కళ్ళు తిరిగి, గేరు మార్చి. ఢాం అనుకుంటూ కింద పడ్డాడు. ఇద్దరు పెద్ద మనుషులు పని మానుకుని ఇలా కళ్ళు తిరిగి ఎందుకు పడ్డారా అని విషయం నాకు అర్ధం అవక, బహుశా ఇటువంటి రిజిస్ట్రేషన్ సమయాలలో అలా పడడం భారత దేశ సాంప్రదాయమేమో అనుకుని నేను కూడా అలాగే కింద పడడానికి సరి అయిన ప్రదేశం వెతుక్కుంటూ సిద్ధ పడుతూ ఉండగా నాకు అన్ని విధాలుగా సహాయం చేస్తున్న మా హనుమంత రావు బావ & జగదీశ్వరక్క కొడుకు, ప్రఖ్యాత లాయరూ అయిన కుంటముక్కల భాస్కర్ నన్ను తీవ్రంగా వారించాడు.

ఇంతకీ కంప్యూటర్ కథనం ప్రకారం విషయం ఏమిటంటే మెరక పొలానికి ఎకరం ఆరు లక్షల రూపాయల వెల కట్టి, దానిమీద అరవై వేల రూపాయలు స్టాంప్ డ్యూటీ కట్టాలిట. అదే ఇళ్ళ స్థలాలయితే ఎకరానికి 36 లక్షల వెల కట్టి, మూడున్నర లక్షల డ్యూటీ కట్టాలిట. ఈ గణాంకాలని బట్టి తన "ఆమ్యామ్యా" గుణించుకుని రిజిస్ట్రార్ గారూ, ఆరు లక్షలకి పొలం బదులు ముఫై ఆరు లక్షలకి ఇళ్ళ స్థలమూ కొనుక్కోవాలేమో అని కొనుగోలు ఆసామీ గారూ కళ్ళు తిరిగి పడ్డారు. అమెరికాలో "లింగ మార్పిడి" కేసులా మెరక పొలం గా ఉన్నది గ్రామ కంఠం ..అనగా ఇళ్ళ స్థలంలా ఎలా మారిపోయిందా అని కంప్యూటర్ సహాయంతో ఆరా తీస్తే తెలిసినది ఏమిటంటే ఎప్పుడో 2001 లో ఒక దగుల్బాజీ పెద్ద మనిషి అప్పటి రిజిస్ట్రార్ సహాయంతో నా పొలం ఉన్న సర్వే నెంబర్ లో కొంత భాగం పేపర్ మీద "కబ్జా" చేసి, దాని ఎక్కువ డబ్బు కోసం ఇళ్ళ స్థలం గా నమోదు చేసి, మరొక దగుల్బాజీకి అమ్మేశాడు. ట...

బహుశా ఆ స్థలాన్ని తనఖా పెట్టి బేంక్ దగ్గర డబ్బు అప్పు తీసుకుని, “అమ్మిన” దగుల్బాజీ, “కొనుక్కున్న” రాస్కెల్ మరియు అన్ని ఏర్పాట్లూ చేసిన సబ్ రిజిస్ట్రార్ గాడిదా  పంచుకుని ఉంటారు. మాకు ఇదేమీ తెలిసే అవకాశం లేదు. కానీ ఆ దొంగ పేపర్ ట్రాన్సాక్షన్ వివరాలు నా ప్రాణాలకి పవిత్ర భారత దేశ పురోగతిలో అంతర్భాగంగా ఇప్పుడు కంప్యూటర్ లో నిక్షిప్తమై పోయాయి. దాన్ని మార్చడానికి జిల్లా కలెక్టర్ తో సహా ఆరుగురు అధికారులు ఉన్న కమిటీకి విన్నవించుకుంటే, చదివింపులు సవ్యంగా ఉంటే  నాలుగేళ్ళు పట్టవచ్చుట. ఇది వినగానే నాకు నిజంగా కళ్ళు తిరిగాయి.  కానీ నాకు పట్టిన ఏలినాటి శని గాడు..క్షమించండి .....శ్రీ ఏలినాటి శని మహాశయుల వారు” నన్ను వదిలేసి పోతూ, పోతూ మంచి చేసిపోయే సమయం సరిగ్గా నాలుగేళ్ల తరవాతే కదా అని వేర్వేరు కారణాలకి క్రిందపడి గిల గిలా కొట్టుకుంటున్న ఉన్న ఆ ఇద్దరికీ ధైర్యం చెప్పి లేవ దీశాను.  ఇది ఆ మూడు రోజుల్లోనూ జరిగిన రెండో ఏలినాటి శని ప్రభావం.

ఇక ఆ రోజే కాకినాడలో అర్ధరాత్రి అమెరికా నుంచి ఫోన్ మోగింది. ఫోన్ తియ్యగానే

“డోంట్ వర్రీ, యువర్ క్వీన్ విక్టోరియా ఈజ్ ఓకే.  థేంక్  గాడ్” అని అమెరికా నుంచి మా అబ్బాయి మొదటి వాక్యంలోనే అశుభ వార్త, శుభ వార్త చెప్పి భరోసా ఇచ్చాడు.

వెంటనే అర్థం అయి “ఏమయిందిరా మీ అమ్మకి” అని అడిగాను కంగారుగా.

“నిన్న రాత్రి తను నీకు టెంకిజెల్ల కొట్టే సమయంలో నువ్వు లేవు కాబట్టి నాకు ఆ మహా ప్రసాదం పెట్టి , ఎప్పటి లాగా వర్క్ వెళ్తూ ఉంటే ఎవడో కారు వెనకాల అరవై మైళ్ళ స్పీడు లో  గుద్దేసాడు.  అమ్మ కారు నాలుగు పల్టీలు కొట్టింది.  ఫైర్ ట్రక్ వాళ్ళు వచ్చి, కారు అద్దాలు కోసి, అమ్మని బైటకి తీసి ఎమర్జన్సీ కి తీసుకెళ్ళారు. లక్కీగా అరికాలు విరగడం తప్ప అమ్మకి ఇంకేమీ అవలేదు. మాములుగా అయితే ఇలాంటి ఏక్సిడెంట్ లో ఎవరూ బతకరు. “ అని వివరాలు చెప్పాడు మా అబ్బాయి.

ఇది సదరు ఏలినాటి శని గాడి ..అవును గాడే.....గారు కానే కాదు....మూడు రోజుల్లో మూడో విధంగా నా మీద “కసి” తీర్చుకునే ప్రయత్నం అని నేను వెంటనే పసి కట్టేశాను. కానీ దమ్ముంటే నా మీద  తన ప్రతాపం చూపించాలి కానీ మా క్వీన్ విక్టోరియా మీద చూపించడం సరి కాదు కదా!  ఏమో ..నేను మటుకు అన్నింటికీ సిద్ధపడే ఉన్నాను.

మా ఆవిడ రోడ్డు ప్రమాదం వార్త తెలియగానే నేను ఆఘమేఘాల మీద హ్యూస్టన్ వచ్చేసి, నా జన్మలో మొదటి సారిగా మా క్వీన్ విక్టోరియా అక్షరాలా “పాద సేవ” చెయ్యడం మొదలు పెట్టాను.



“ఆ ఫోన్ ఇక్కడ పెట్టు, మంచి నీళ్ళ సీసా నింపి తీసుకురా, ఇవాళ ఎక్కువ ఆకలి లేదు, అరిటి కాయ వేపుడు చాల్లే, నీకు పులుసు సరిగ్గా చెయ్యడం రాదు , ఆ టీవీ కొంచెం కనపడేలా పక్కకి టిప్పు, ఆ వెధవ న్యూస్ చానెల్ పెట్టకు, హాయిగా అగ్నిపూలు చూసుకుంటాను” మొదలైన ఆవిడ కోరికలు తీరుస్తూ, మరో ఆరు వారాలు గడిపేస్తాను. రెండు రోజుల్లో ఆవిడ కాలికి సర్జరీ అవుతుంది.  ప్రస్తుత పరిస్తితులలో మా క్వీన్ విక్టోరియా విశ్రమిస్తున్న ఫోటో ఇందుతో జతపరుస్తున్నాను. నాకంటే విశ్వాస పాత్రురాలు, ఏం జరిగిందో తెలియక వెర్రి మొహం వేసుకుని అక్కడే కూచున్న మా ఆవిడ పెంపుడు కుక్క “యోడా” ని కూడా ఈ ఫోటోలో చూడవచ్చును.  ఆవిడ కారుని వెళ్లి చూస్తే భయం వేసింది. తను కూచున్న డ్రైవర్ సీటు తప్ప

మిగిలిన కారు అంతా తుక్కు, తుక్కు అయిపోయింది. దేవుడి దయకి ఇంతకన్నా నిదర్శనం ఇంకేం లేదు.

అన్నట్టు హైదరాబాద్ లో బయలు దేరే రోజే తర్జన భర్జన పడి, నాది గ్రామ కంఠం కానే కాదనీ, అక్కడ రెండు కిలో మీటర్ల దూరం లో ఎక్కడా ఒక్క ఇల్లు కూడా లేదనీ, కావాలంటే మా పొలం లో పండిన నాలుగు చెరుకు కాడలు, బస్తా కందులూ బహుమతిగా ఇస్తాననీ, తమ కంప్యూటర్ లో తిరిగి మెరక పొలం లా నమోదు చేసి నాకు సమన్యాయం చెయ్యమని రిజిస్ట్రార్ గారికి ఆర్డరు వెయ్యమని హై కోర్ట్ లో ప్రభుత్వం మీద దావా వేశాను. ఇది నా జన్మలో వేసిన మొట్ట మొదటి దావా. ఈ దావా తెలంగాణాలో విచారణకి వస్తుందో, సరి కొత్త ఆంధ్రప్రదేశ్ లో విచారణకి వస్తుందో ఆ ఏలినాటి శని గాడి (రి) నిర్ణయానికే వదిలేస్తున్నాను. ఈ దావాలో జిల్లా కలెక్టరూ, తదితర సవా లక్ష స్థానిక ప్రభుత్వాధికారులతో బాటు ఎందుకైనా మంచిదని కాబోయే తాత్కాలిక ముఖ్యమంత్రులయిన చిరంజీవి గారిని, దామోదర నరసింహం గారినీ, బొత్స గారినీ, చంద్ర బాబునీ, వై యస్ జగన్ నీ, వార్తా పత్రికలలో కనపడిన అడ్డమైన రాజకీయ నాయకుల్నీ కూడా ప్రతివాదులుగా చేర్చి పారేశాను. "దొరకునా ఇటువంటి కేసూ" అన్నాడు కదా త్యాగరాజు.

అన్నట్టు నాకు కేసీఆర్ గారికీ ఒక పోలిక ఉంది అని ఈ ఫిబ్రవరి నెలలోనే గమనించాను. ఆయన న్యూఢిల్లీ వెళ్తూ "ఆంధ్ర ప్రదేశ్ నుంచి వెళ్తున్నాను, మళ్ళీ తెలంగాణా లో అడుగుపెడతాను" అనే ప్రతిజ్ఞ నిలబెట్టుకుంటే, నేను ఎలాంటి ప్రతిజ్ఞా చెయ్యకుండానే దానికి ఆపోజిట్ గా అదే తేదీలలో సమైక్యంధ్రా లో అడుగుపెట్టి తెలంగాణా నుంచి వెనక్కి అమెరికా వచ్చాను.

అన్నట్టు, నేను హ్యూస్టన్ తిరిగి వచ్చిన ఎమిరేట్స్ విమానం వారు నా రెండు పెట్టెలూ ఇంకెక్కడికో పంపించేశారు. అది కూడా ఏలినాటి శని ప్రభావమేమో తెలియదు కానీ కూడా మోసుకొచ్చిన నా ల్యాపు టాపు ఉండబట్టి ఈ కథ వ్రాసి, సమయానికి పంపించగలగడం ఏ గ్రహం ప్రభావమో........వెల్.... మీ సిద్ధాంతి ని అడగండి. చదివేది మీ గ్రహబలం వలనే కదా!

COMMENTS